ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



# పంచముఖి హనుమాన్ ఆలయ నూతన షెడ్ ప్రారంభం



**ఉద్యమ కెరటం, బోథ్:** బోథ్ పట్టణంలోని హనుమాన్ గల్లీలో గల పంచముఖి హనుమాన్ మందిర నూతన షెడ్‌ను కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ శనివారం ప్రారంభించారు. బోథ్ సర్పంచ్ కుర్మే అన్నపూర్ణ–మహేందర్ (టీపీసీసీ రాష్ట్ర ఎస్సీ విభాగం వైస్ చైర్మన్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన షెడ్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. మందిర అభివృద్ధి కోసం స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ్ సింగ్, యువజన కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# కష్టాల్లో ఉన్న కుటుంబాలకు అండగా ఆడే గజేందర్



**ఉద్యమ కెరటం, బోథ్:** కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పర్యటించి ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల కుటుంబాలను శనివారం పరామర్శించారు. పోచ్చెర గ్రామంలో శ్రీకాంత్‌రెడ్డి తల్లి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ధన్నూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ చాకలి అడెల్లు తండ్రి చాకలి బాపు మృతికి నివాళులర్పించారు. అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త చిట్యాల రాజు తల్లి చిట్యాల అడెల్ల మృతి విషయం తెలుసుకుని వారి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఏ అవసరం వచ్చినా సహాయానికి ముందుంటామని తెలిపారు. ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం నాయకుల బాధ్యత అని పేర్కొన్నారు. రాజకీయ నేత అంటే కేవలం ఎన్నికలప్పుడే కనిపించేవాడు కాదని, ప్రజల కష్టసుఖాల్లో తోడుగా నిలిచేవాడే నిజమైన నాయకుడని నిరూపిస్తున్నారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# నర్మాల వీడీసీ అధ్యక్షుడిగా చాత్రబోయిన రాజు



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట మండలం నర్మాల గ్రామ విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ (వీడీసీ) అధ్యక్షుడిగా చాత్రబోయిన రాజు ఎన్నికయ్యారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లడంతో పాటు ప్రజల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. చాత్రబోయిన రాజు వీడీసీ అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో గ్రామస్తులు, వీడీసీ సభ్యులు, నాయకులు, యువకులు ఆయనకు అభినందనలు తెలిపారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరేలా సమన్వయం చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ తనపై నమ్మకంతో వీడీసీ అధ్యక్షుడిగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అందరినీ కలుపుకొని గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రజల అవసరాలు, సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. గ్రామంలో మౌలిక వసతులు, పారిశుధ్యం, తాగునీరు, రహదారులు, డ్రైనేజీ తదితర సమస్యలపై సంబంధిత అధికారులతో సమన్వయం చేసి పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

# బంగారు, వెండి ఆభరణాల చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

- **రూ.85,600 విలువైన ఆభరణాలు స్వాధీనం**
- **చోరీకి గురైన ఆభరణాలు కొనుగోలు చేసిన వ్యక్తిపై కేసు**



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** గుడిహత్నూర్ మండల కేంద్రంలోని మహంకాళి గల్లీలో ఓ ఇంట్లో తాళాలు పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేసిన కేసును పోలీసులు ఛేదించారు. ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసి రూ.85,600 విలువైన బంగారు, వెండి ఆభరణాలను రికవరీ చేసినట్లు గుడిహత్నూర్ ఎస్సై ఎల్.శ్రీకాంత్ తెలిపారు. ఈనెల 9న బాధితురాలు దుర్వ రాధ తన భర్తతో కలిసి కూలి పనులకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చారు. ఇంటి తాళంతో పాటు లోపల ఉన్న స్టీల్ బాక్స్ తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గుర్తించారు. బాక్స్‌లో భద్రపరిచిన బంగారు, వెండి ఆభరణాలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి రెండు పగిలిన తాళాలను స్వాధీనం చేసుకున్నారు. క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్ బ్యూరో సహకారంతో స్టీల్ బాక్స్ తదితర వస్తువులపై ఉన్న వేలిముద్రలను సేకరించారు. సాంకేతిక ఆధారాలతో పాటు క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేపట్టి నిందితుడి కదలికలను గుర్తించారు. శుక్రవారం ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసి, చోరీకి గురైన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఏ1 నిందితుడైన బజార్‌హత్నూర్ మండలం గిర్జాయి గ్రామానికి చెందిన డ్రైవర్ పెందూర్ మధుకర్ ప్రస్తుతం గుడిహత్నూర్ లో నివసిస్తున్నాడని తెలిపారు. అలాగే చోరీ చేసిన వస్తువులను కొనుగోలు చేసిన గుడిహత్నూర్ లింగాపూర్ రోడ్లోని ఏ2 దహలే సంతోష్ గోల్డ్‌స్మిత్ పై కూడా కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. చోరీ చేసిన వస్తువులు అని తెలిసి కూడా వాటిని కొనుగోలు చేయడం, విక్రయించేందుకు సహకరించడం చట్టపరంగా నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఇళ్లకు నాణ్యమైన తాళాలు ఏర్పాటు చేసుకోవాలని, ఎక్కువ సమయం ఇంటికి తాళం వేసి వెళ్లాల్సి వస్తే సమీప పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# చలో ఐటీడీఏ ఆదివాసీ మార్చ్ ను విజయవంతం చేయండి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ఆదివాసీల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం చేపట్టనున్న చలో ఐటీడీఏ ఆదివాసీ మార్చ్ ను విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం లఖంపూర్ రాయిసెంటర్ లో ఆదివాసీ మార్చ్ కు సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని విమర్శించారు. పోడు భూములకు పట్టాలు, ఐటీడీఏ నిధుల దుర్వినియోగం, గిరిజన యూనివర్సిటీ, ఉపాధి, విద్య, వైద్య రంగాల్లో జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నించేందుకే ఈ ఆదివాసీ మార్చ్ చేపడుతున్నామని తెలిపారు. ఐటీడీఏ పరిధిలోని ప్రతి గిరిజన గ్రామం నుంచి ఆదివాసీలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు దాదేరావు, సర్మెడి ఆత్రం గంగారాం, ఆదివాసీ నాయక్ పోడ్ అధ్యక్షులు పెరుమాండ్ల గంగాధర్, సర్పంచ్ లు శంకర్, కృష్ణ, అమృత్, రాజేందర్, గంగాధర్, ఆదివాసీ నాయకులు కోటేష్, సోనేరావు, రాజు, గంగారాం, వివిధ గ్రామాల పటేళ్లు, దేవరీలు, యువకులు పాల్గొన్నారు.

# మండపాల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

**పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**



**ఉద్యమ కెరటం, తాండూర్:** వినాయక విగ్రహాల ఏర్పాటు, ఉత్సవాల నిర్వహణకు పోలీస్ శాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. ఈనెల 14న వినాయక చవితి సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో మండపాలు ఏర్పాటు చేసి విగ్రహాలను ప్రతిష్ఠించాలనుకునే నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసి పోలీస్ శాఖ అనుమతి పొందాలని తెలిపారు. విగ్రహం ఏర్పాటు చేసే ప్రదేశం, సంబంధిత పోలీస్ స్టేషన్, విగ్రహం, మండపం ఎత్తు, ఉత్సవ కమిటీ సభ్యుల పేర్లు, ఫోన్ నంబర్లు, ప్రతిష్ఠాపన తేదీ, నిమజ్జనం తేదీ, సమయం, ప్రదేశం, నిమజ్జనానికి ఉపయోగించే వాహనం తదితర వివరాలను https://policeportal.tspolice.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని సూచించారు. మండప నిర్వాహకులు, గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు, వాలంటీర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, చిరునామాలను కూడా పూర్తిగా నమోదు చేయాలని తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని పట్టణాలు, గ్రామాల్లో ఏర్పాటు చేసే ప్రతి గణపతి మండపం నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ నమోదు విషయంలో ఇబ్బందులు ఎదురైతే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఉత్సవ కమిటీలు మట్టి వినాయక విగ్రహాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. వినాయక మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు.

# కరెంట్ కోతలపై రైతుల కన్నెర్ర

- **సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన అన్నదాతలు**
- **కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్**







**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** వ్యవసాయ విద్యుత్ కోతలపై రైతులు కన్నెర్ర చేశారు. ఖమ్మం జిల్లా వేంసూరు మండలం కందుకూరులో విద్యుత్ కోతలకు నిరసనగా కందుకూరు, దిద్దుపూడి, భరణిపాడు, లచ్చన్నగూడెం, వెంకటాపురం గ్రామాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కందుకూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కనీసం ఏడు గంటల విద్యుత్ కూడా సక్రమంగా సరఫరా కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని తెలిపారు. విద్యుత్ కోతల కారణంగా పంటలకు సకాలంలో నీరందించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. విద్యుత్ సరఫరాను వెంటనే మెరుగుపర్చి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనకు సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల విద్యుత్ అవసరాలపై ముందస్తు ప్రణాళిక లేకపోవడం ప్రభుత్వ వైఫల్యమేనని విమర్శించారు. అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచి విద్యుత్ కొనుగోలు చేసైనా రైతులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందించి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు కోతలు లేని విద్యుత్ అందించి పంటలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. అనంతరం సండ్ర వెంకట వీరయ్య సబ్‌స్టేషన్‌లోకి వెళ్లి విద్యుత్ సరఫరాకు సంబంధించిన లాగ్‌బుక్‌ను పరిశీలించారు. రైతులకు వాస్తవంగా ఎంత సమయం విద్యుత్ సరఫరా అవుతోంది, ఎంతసేపు అంతరాయం ఏర్పడుతోందనే వివరాలను పరిశీలించారు. విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించకపోతే రైతులతో కలిసి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పాల వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, కందుకూరు సర్పంచ్ మందపాటి వెంకటరెడ్డి, ఉప సర్పంచ్ గొర్ల ప్రభాకర్‌రెడ్డి, భరణిపాడు బీఆర్ఎస్ నాయకుడు మందపాటి మహేశ్వరరెడ్డి, రైతులు, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనం నడిపితే జైలు శిక్ష తప్పదు

- **ఆరుగురికి రెండు రోజుల జైలు.. ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా**

**ఉద్యమ కెరటం, మద్నూర్:** మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఆరుగురికి న్యాయస్థానం శిక్ష విధించినట్లు మద్నూర్ ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. మద్నూర్ మండల వ్యాప్తంగా పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిని కోర్టులో హాజరుపర్చారు. విచారణ అనంతరం ఆరుగురికి రెండు రోజుల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మద్యం సేవించిన తర్వాత వాహనం నడపడం చట్టరీత్యా నేరమే కాకుండా, వాహనదారుడి ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను సైతం ప్రమాదంలోకి నెట్టే చర్య అని అన్నారు. ప్రతి వాహనదారుడు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. ప్రజల ప్రాణాల రక్షణే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని, జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

# పచ్చని రహదారిపై నెత్తుటి మరకలు

- ఖమ్మం– దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేపై వరుస ప్రమాదాలు
- అతివేగమా.. రోడ్డు డిజైన్ లోపమా.. అధికారుల నిర్లక్ష్యమా..?
- గత నెలలోనే పదుల సంఖ్యలో ప్రమాదాలు
- ఆగి ఉన్న వాహనాలను ఢీకొంటున్న ఘటనలపై ఆందోళన






**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేపై వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ప్రయాణికుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా సత్తుపల్లి నుంచి తెలంగాణ ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతం వరకు, కల్లూరు చింతలపూడి మధ్య గ్రీన్‌ఫీల్డ్ హైవేపై తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో అసలు తప్పు ఎక్కడ ఉందనే ప్రశ్న తలెత్తుతోంది. అతివేగం కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయా..? రోడ్డు డిజైనింగ్‌లో లోపాలున్నాయా..? ఇంజనీరింగ్ మ్యాప్ సరిగా లేదా..? కాంట్రాక్టర్ పనితీరులో లోపమా..? లేక సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడిందా..? అనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. గడచిన నెల రోజుల వ్యవధిలోనే ఈ మార్గంలో పదుల సంఖ్యలో వాహన ప్రమాదాలు జరిగినట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

**ఆగి ఉన్న వాహనాలనే ఢీకొంటున్న ఘటనలు..**

ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ఎక్కువగా వెనుక నుంచి వేగంగా వస్తున్న వాహనాలు రోడ్డు పక్కన, రహదారిపై ఆగి ఉన్న లారీలు, కార్లు, ఇతర వాహనాలను ఢీకొంటున్న ఘటనలు జరుగుతున్నాయి. దీంతో ఈ ప్రమాదాలు కేవలం డ్రైవర్ నిర్లక్ష్యమేనా లేక రహదారి నిర్మాణంలోనూ లోపాలున్నాయా అన్న చర్చ జరుగుతోంది. రోడ్డు మార్గంలో సరైన అత్యవసర పార్కింగ్ సదుపాయాలు లేకపోవడంతో వాహనాల్లో సాంకేతిక లోపాలు తలెత్తినప్పుడు లారీలు, ఇతర భారీ వాహనాలను రోడ్డుపైనే నిలపాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వాహనదారులు చెబుతున్నారు. దీంతో వెనుక నుంచి వచ్చే వాహనాలు ఆగి ఉన్న వాహనాలను సకాలంలో గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నట్లు తెలుస్తోంది.

**వంద కిలో మీటర్ల వేగం.. ఒక్క క్షణం అజాగ్రత్తే ప్రమాదం**

హైవేపై ప్రైవేట్ బస్సులు, లారీలు, కార్లు అత్యంత వేగంగా ప్రయాణిస్తున్నాయి. కొన్ని వాహనాలు గంటకు వంద కిలో మీటర్లకు పైగా వేగంతో వెళ్తుండటంతో ఒక్క క్షణం డ్రైవర్ దృష్టి మరలినా ఘోర ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. రెప్పపాటు కునుకు, క్షణకాలం అజాగ్రత్త, తల తిప్పడం వంటి చిన్న పొరపాట్లు కూడా ప్రాణాంతకంగా మారే పరిస్థితి ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ మార్గంలో ప్రయాణించే డ్రైవర్లు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.

**ఆంధ్ర ప్రదేశ్ వెళ్లే వాహనదారులకు విజ్ఞప్తి..**

హైదరాబాద్ నుంచి సూర్యాపేట, సత్తుపల్లి మీదుగా దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే ద్వారా జంగారెడ్డిగూడెం, రాజమండ్రి, అమలాపురం, తాడేపల్లిగూడెం, తుని, నర్సీపట్నం, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు, లారీలు, కార్ల డ్రైవర్లు అత్యంత జాగ్రత్తగా ప్రయాణించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. వాహనాలను హైవే పక్కన ఇష్టానుసారంగా నిలపకుండా, తప్పనిసరి పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న సురక్షిత పార్కింగ్ ప్రాంతాల్లోనే నిలపాలని సూచిస్తున్నారు. వాహనం చెడిపోయిన సందర్భాల్లో రహదారిపై నిలిపితే వెనుక నుంచి వచ్చే వాహనాలకు స్పష్టంగా కనిపించేలా తగిన హెచ్చరికలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.

**యండపల్లి వద్ద ఘోర ప్రమాదం. ఒకరు మృతి..**

ఇదిలా ఉండగా, ఏలూరు జిల్లా చింతలపూడి మండలం రాఘవాపురం సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ హైవేపై శనివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి విజయనగరం వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు (ఏపీ 39 3178) హైవేపై ఆగి ఉన్న లారీ (కేఏ56 8893)ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు క్లీనర్ మృతిచెందగా, 15 మందికి పైగా ప్రయాణికులు గాయపడినట్లు సమాచారం. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రులకు తరలించారు. సమాచారం అందుకున్న చింతలపూడి సీఐ క్రాంతికుమార్, ఎస్సై సతీష్ ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి హైదరాబాద్‌కు పాదయాత్ర

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం వైఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్ర చేపట్టారు. ఈనెల 10న ఆదిలాబాద్‌లో ప్రారంభమైన పాదయాత్రలో ఆటో యూనియన్ అధ్యక్షులు, వైఎస్ఆర్ ఫౌండేషన్ నాయకులు పాల్గొన్నారు. శనివారం పాదయాత్ర మండలంలోని వాంకిడి గ్రామానికి చేరుకోగా, స్థానిక ఆటో డ్రైవర్లు ఘన స్వాగతం పలికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో సుమారు 3వేల ఆటోలు ఉన్నాయని, వాటిపై ఆధారపడి జీవిస్తున్న డ్రైవర్ల ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇంటి స్థలాలు కేటాయించి, ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవడంతో పాటు ప్రత్యేకంగా ఆటోనగర్ కాలనీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాంకిడి గ్రామ ఆటో డ్రైవర్లు తౌఫిక్ తదితరులు పాల్గొన్నారు.




# గర్భిణీలు, బాలింతలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

## జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి

**ఉద్యమ కెరటం, కరీంనగర్:** గర్భిణీలు, బాలింతలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి అన్నారు. ఐసీడీఎస్ కరీంనగర్ అర్బన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మార్కండేయనగర్ అంగన్వాడీ కేంద్రంలో శనివారం పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ తెల్ల లక్ష్మీ రమేష్, సీడీపీఓ కవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా సంక్షేమ అధికారి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు బలవర్ధకమైన పోషకాహారం తీసుకోవాలని సూచించారు. కుటుంబ సభ్యులు కూడా వారికి సమతుల్య ఆహారం అందేలా ప్రోత్సహించాలని తెలిపారు. తల్లి, బిడ్డలు పోషకాహార లోపానికి గురికాకుండా ఆరోగ్యంగా ఉండేందుకు పోషకాహారం ఎంతో అవసరమన్నారు. మహిళల్లో ఐరన్ లోపాన్ని నివారించేందుకు మునగ, బచ్చలి తదితర ఆకుకూరలు, పల్లీలు, బెల్లం వంటి ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. సీజన్‌లో లభించే పండ్లు, తాజా కూరగాయలను ప్రతిరోజూ ఆహారంలో భాగం చేసుకోవాలని తెలిపారు. గర్భిణీలు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు బరువు, ఎత్తును పరీక్షించుకోవాలని సూచించారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రత్యేక బాలామృతం అందిస్తున్నట్లు తెలిపారు. నెలలు నిండిన గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సీడీపీఓ కవిత వివరించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం తల్లులకు క్విజ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ వెంకటలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు శ్రీలత, రమణ, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



# నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని డీఎస్పీ నాగేంద్రచారి, ఎల్లారెడ్డిపేట సీఐ ఓదెల వెంకటేష్, గంభీరావుపేట ఎస్సై శ్రీకాంత్ సూచించారు. శనివారం గంభీరావుపేట మండల కేంద్రంలోని రెడ్డి సంఘంలో గణపతి మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి ఉత్సవాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణపతి మండపాల వద్ద భద్రత చర్యలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా మండప నిర్వాహకులు, భక్తులు పోలీసులకు పూర్తిగా సహకరించాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉత్సవాలను నిర్వహించుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరూ పాల్పడవద్దని స్పష్టం చేశారు. మండపాల వద్ద భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ముఖ్యంగా గణపతి నిమజ్జనం సమయంలో పోలీసుల సూచనలు, నిబంధనలు తప్పక పాటిస్తూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా పూర్తి చేయాలని కోరారు. గణపతి నవరాత్రి ఉత్సవాలు విజయవంతంగా, ప్రశాంతంగా జరిగేలా ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండలంలోని వివిధ గణపతి మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.







# సీతారాం ఏచూరి జీవితం ఆదర్శప్రాయం

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** విద్యార్థి దశ నుంచే ప్రజా, శ్రామిక ఉద్యమాల్లో కీలక పాత్ర పోషిస్తూ అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన అమరజీవి కామ్రేడ్ సీతారాం ఏచూరి జీవితం అందరికీ ఆదర్శప్రాయమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి అన్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అమరజీవి కామ్రేడ్ సీతారాం ఏచూరి ద్వితీయ వర్ధంతి సభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏచూరి చిత్రపటానికి మాచర్ల భారతి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సీపీఎం పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో మాచర్ల భారతి, శీలం సత్యనారాయణరెడ్డి, మోరంపూడి పాండురంగారావు మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుంచే ప్రజా ఉద్యమాలు, శ్రామిక పోరాటాల్లో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. అణగారిన వర్గాల సమస్యలపై పార్లమెంటులో గళమెత్తిన గొప్ప మార్క్సిస్టు మేధావిగా ఏచూరి దేశ రాజకీయాల్లో విశిష్ట స్థానం సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, రైతు, కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అదుపుతప్పి పల్టీ కొట్టిన బియ్యం లారీ



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా వైరా మండలం గడగలపాడు గ్రామ సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ హైవే బ్రిడ్జి వద్ద బియ్యం లోడ్తో వెళ్తున్న ఓ లారీ అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. బియ్యం లోడ్తో వెళ్తున్న లారీ బ్రిడ్జి వద్దకు చేరుకోగానే అదుపుతప్పి రోడ్డుపై పల్టీ కొట్టింది. ఘటనలో లారీ డ్రైవర్ గాయపడగా, వెంటనే స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన సమయంలో ఇతర వాహనాలు సమీపంలో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

# రోడ్డు భద్రత, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం

## అదనపు డీసీపీ వెంకటరమణ రెడ్డి

**ఉద్యమ కెరటం, కరీంనగర్:** ప్రజల భద్రత, రహదారి ప్రమాదాల నివారణ, నేరాల నియంత్రణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎంతో కీలకమని అదనపు డీసీపీ (అడ్మిన్) వెంకటరమణ రెడ్డి అన్నారు. కొత్తపల్లి–జగిత్యాల హైవేపై ప్రజల భద్రతను మరింత పటిష్టం చేసే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వ్యవస్థను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి, రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్, కొత్తపల్లి సీఐ బి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాన రహదారులు, హైవేలపై ఏర్పాటు చేసే సీసీ కెమెరాల ద్వారా 24 గంటల నిఘా, వాహనాల రాకపోకల పర్యవేక్షణ, ప్రమాదాల గుర్తింపు, నేరాలకు సంబంధించిన ఆధారాల సేకరణకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రమాదాలు జరిగిన సందర్భంలో సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను పరిశీలించడం ద్వారా దర్యాప్తును వేగవంతం చేయవచ్చని పేర్కొన్నారు. ఆధునిక సీసీ కెమెరా వ్యవస్థల్లో హైరిజల్యూషన్ వీడియో రికార్డింగ్, రాత్రివేళల్లో నిఘా, వాహనాల నంబర్ ప్లేట్లను గుర్తించే సాంకేతికత, నిరంతర పర్యవేక్షణ వంటి సదుపాయాలు ఉండటంతో హైవేలపై భద్రత ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని వివరించారు. ప్రజా సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న డాక్టర్ వి.నరేందర్ రెడ్డిని అధికారులు అభినందించారు. భవిష్యత్తులోనూ మరిన్ని సమాజహిత కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా భద్రతకు తోడ్పడే సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీ దళిత మోర్చా జిల్లా కమిటీ సభ్యునిగా పొట్లగళ్ల శంకర్



**ఉద్యమ కెరటం, నర్సాపూర్:** మెదక్ జిల్లా నర్సాపూర్ బీజేపీ దళిత మోర్చా మెదక్ జిల్లా కమిటీ సభ్యునిగా హత్నూర గ్రామానికి చెందిన పొట్లగళ్ల శంకర్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేశం గౌడ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. జిల్లా దళిత మోర్చా అధ్యక్షులు బాల్ రాజ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా హత్నూర గ్రామానికి ప్రాతినిధ్యం లభించడంపై స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. శంకర్ నియామకం పట్ల పార్టీ శ్రేణుల్లో మరింత నూతన ఉత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన పొట్లగళ్ల శంకర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా దళిత మోర్చా కమిటీ సభ్యునిగా అవకాశం కల్పించిన జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, దళితుల సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

